# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 96 క్రిష్ణా, మంగళవారం 30 - 12 - 2025 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు


98497 07349


## చంద్రబాబు సర్కార్ సంచలన నిర్ణయం..

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** సోమవారం సచివాలయంలో ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేశారు. దాదాపు 24 అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్ మీడియాకు వెల్లడించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు ఇప్పటికే ఉన్న జిల్లాల్లో పలు మార్పులు చేశారు. అలాగే డివిజన్లు, మండలాలను మార్చడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయాలు ఏంటో తెలుసుకుందాం.

ఏపీలో కొత్తగా మూడు జిల్లాలు

గత ప్రభుత్వం జిల్లాల విభజన సరిగ్గా చేపట్టలేదని ఆరోపిస్తున్న కూటమి ప్రభుత్వం.. పునర్విభజనలో భాగంగా కొత్తగా మూడు జిల్లాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 29 జిల్లాల బదులు 28 జిల్లాలకే పరిమితం చేయాలని చూస్తోంది. ప్రకాశం జిల్లాలోని మార్కాపురంను జిల్లాగా ఏర్పాటు చేస్తామని గత ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకు మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటును కేబినెట్ ఆమోదించింది. మార్కాపురం, గిద్దలూరు, కనిగిర, యర్రగొండపాలెం కలిపి ఒక జిల్లాగా త్వరలో ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ముందడుగు వేయగా.. ఇక అన్నమయ్య జిల్లా పేరును అలాగే ఉంచగా.. మదనపల్లెను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయనున్నారు. రాజంపేట కేంద్రంగా జిల్లా కోసం ఇప్పటికే పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాయచోటినే కొనసాగించాలంటూ అక్కడ కూడా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రాయచోటి కాకుండా మదనపల్లి కేంద్రంగా అన్నమయ్య జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇక బనగానపల్లె, అడ్డరోడ్లను డివిజన్లుగా ఏర్పాటు చేయనుండగా. పెనుగొండను వాసవీ పెనుగొండగా మార్చాలని నిర్ణయించారు. అలాగే విశాఖలో ఆస్పత్రి



నిర్మాణానికి భూమి కేటాయించారు. జనవరి 1 నుంచి ఈ మార్పులు అమల్లోకి తీసుకురానున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది.

మంత్రి భావోద్వేగం

రాయచోటి నుంచి జిల్లా కేంద్రం తరలిపోవడంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భావోద్వేగానికి లోనయ్యారు. కేబినెట్ మీటింగ్‌లోనూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కన్నీళ్లు పెట్టుకున్నారు. మంత్రిని సీఎం చంద్రబాబు సముదాయించి రాయచోటి అభివృద్ధిపై భరోసా ఇచ్చారు. కేబినెట్ సమావేశం తర్వాత ఈ అంశంపై మీడియా ప్రశ్నించడంతో మంత్రి మరోసారి కన్నీళ్లు పెట్టుకున్నారు. జిల్లా కేంద్రం మార్పుపై ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు. కేబినెట్ భేటీ అనంతరం సీఎం చంద్రబాబుతో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాయచోటిని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని బుజ్జగించిన చంద్రబాబు.. భవిష్యత్‌లో ఇబ్బంది లేకుండా చూస్తానని చెప్పినట్లు తెలుస్తోంది

## దశదిన ఖర్చులకు ఆర్థిక సహాయం అందించిన ఆదిత్య చౌదరి




**ఏలూరు జిల్లా ముదినేపల్లి::::క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి: ::** దశదిన ఖర్చులకు ఆర్థిక సహాయం అందించిన ఆదిత్య చౌదరి అనారోగ్యం సమస్యతో మరణించిన ముడిదొడ్డి వీర్రాజు కుటుంబానికీ, ముదినేపల్లి తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఆదేశానుసారం వారి తనయుడు తనయుడు ఆదిత్య చౌదరి మృతుని కుటుంబసభ్యులకు దశదిన ఖర్చుల నిమిత్తంగా 10,000రూపాయలు ఆర్థిక సహాయం చేశారు ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ గంటా రాకేష్ కుమార్, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లపోతు ప్రసాద్,పల్లపోతు శ్రీనివాసరావు,,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు మృతుని కుటుంబ సభ్యులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి,వారి కుమారుడు ఆదిత్య చౌదరి లకు కృతజ్ఞతతో ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు

## ఆర్థిక సహాయం అందించిన సహకార సొసైటీ బ్యాంక్



**ఏలూరు జిల్లా ముదినేపల్లి:::: క్రైం కౌంటర్ న్యూస్ ప్రతినిధి:::** ఆర్థిక సహాయం అందించిన సహకార సొసైటీ బ్యాంక్ శతాధిక వృద్ధురాలైన కోడూరు వీరరాఘవమ్మ మరణించిన సందర్భముగా ముదినేపల్లి తెలుగుదేశం పార్టీ మండలాధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి,వారి తనయుడు తనయుడు ఆదిత్య చౌదరిలు సొసైటీ బ్యాంకు చైర్మన్ బొప్పన లక్ష్మి నరసింహారావు కి తెలియపర్చి న ప్రకారంగా మృతురాలి కుటుంబికులకు చల్లగుళ్ల లక్ష్మి నరసింహరాయ ప్రాథమిక సహకార సొసైటి (ప్రై)లిమిటెడ్ బ్యాంక్ కాతా దారురాలుగా వున్న కోడూరు వీరరాఘవమ్మ కు సొసైటీ ద్వారా మట్టి ఖర్చులు, దశదిన ఖర్చుల నిమిత్తంగా 10,000రూపాయలు ఆర్థిక సహాయాన్ని సొసైటి బ్యాంకు నిబంధనల ప్రకారం చైర్మన్ బొప్పన లక్ష్మి నరసింహారావు అదేశాలతో డైరెక్టర్ పల్లపోతు ప్రసాద్ చేతులమీదుగా ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమం లో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లపోతు ప్రసాద్,పల్లపోతు శ్రీనివాసరావు,కోడూరు వాసు,కోడూరు వీరయ్య,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు శతాధిక వృద్ధురాలైన మృతురాలి కుటుంబ సభ్యులు సొసైటీ బ్యాంక్ చైర్మెన్ బొప్పన లక్ష్మి నరసింహారావు, చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి,వారి కుమారుడు ఆదిత్య చౌదరి లకు కృతజ్ఞతతో ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసారు

## గీత దాటొద్దు న్యూ ఇయర్ వేడుకలకు అనుమతి తప్పనిసరి



**కపుల్స్ కోసం నిర్వహించే కార్యక్రమాలు, పబ్‌లలోకి మైనర్లను అనుమతించరాదు**

**కార్యక్రమాన్ని అర్ధరాత్రి ఒంటి గంటకు ముగించాలి**

**31న రాత్రి నగరవ్యాప్తంగా తనిఖీలు**

**మద్యం సేవించి వాహనం నడిపితే జైలు, జరిమానా**

**పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి**

**క్రైం కౌంటర్ న్యూస్,** విశాఖపట్నం, డిసెంబరు 29 నూతన సంవత్సరం వేడుక పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించడానికి పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఒక ప్రకటన ద్వారా స్పష్టంచేశారు. వేడుకలు నిర్వహించాలనుకునే హెూటళ్లు, క్లబ్‌లు, అసోసియేషన్లు, ఈవెంట్ మేనేజర్లు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏపీ పబ్లిక్ సేఫ్టీ (మెజర్స్) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్ 2013 ప్రకారం నిర్వాహకులు ప్రతీ ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద, పార్కింగ్ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాల్సి ఉంటుందన్నారు. అన్ని రకాలుగా జాగ్రత్తలు పాటిస్తున్నారని నిర్ధారించుకున్న తర్వాతే అనుమతి జారీచేయడం జరుగుతుందన్నారు. కపుల్స్ కోసం నిర్వహించే కార్యక్రమాలు, పబ్‌లలోకి మైనర్లను అనుమతించరాదన్నారు. స్విమ్మింగ్‌పూల్స్ వద్దకు ఎవరినీ అనుమతించకుండా ప్రత్యేక గస్తీ ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. అర్ధనగ్న ప్రదర్శనలు, అశ్లీలతకు తావులేకుండా కార్యక్రమాలు జరుపుకోవాలన్నారు. డీజే స్పీకర్ల శబ్దం కూడా 45 డిసిబెల్స్‌కి మించకూడదని స్పష్టంచేశారు. బాణాసంచా కాలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అనుమతించిన సమయం వరకే మద్యం అనుమతించాలని, అగ్నిమాపక శాఖ అధికారుల సలహాలు పాటించాలని సూచించారు. వాటన్నింటినీ కస్టమర్లకు తెలిసేలా వేడుక జరిగే ప్రాంతంలో బోర్డులు ఏర్పాటుచేయాలని సీపీ సూచించారు. కార్యక్రమాన్ని అర్ధరాత్రి ఒంటి గంటకు ముగించాలని సీపీ స్పష్టంచేశారు. ఒకవేళ ఎవరైనా అనుమతి లేకుండా వేడుకలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 31వ తేదీ ప్రతి జంక్షన్ వద్ద పోలీసుల గస్తీ, పికెట్ ఉంటుంది కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని, రూ.పది వేల వరకూ జరిమానా, ఆరు నెలలు వరకూ జైలు శిక్షపడే అవకాశం ఉంటుందన్నారు. 31న నగరంలో పోలీసులు, ఈగల్ టీమ్‌లు కలిసి గస్తీ తిరుగుతాయని, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వాడితే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కి లేదంటే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని నగరవాసులను కోరారు.

## బుసినే విరుపాక్షిని పరామర్శించిన జగన్



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** మోకాలు సంబంధిత శస్త్రచికిత్స చేయించుకొని ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా విరుపాక్షి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న వైయస్ జగన్, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటిస్తూ పూర్తి ఆరోగ్యంతో ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆయన కోరారు. పార్టీ అధ్యక్షుని నుంచి వచ్చిన పరామర్శకు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా విరుపాక్షి ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షించారు.

## రాయచోటిని తొలగించడంపై సీఎం చంద్రబాబు కూడా బాధపడ్డారన్న మంత్రి అనగాని

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని తొలగించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఫీల్ అయ్యారని, ఈ నిర్ణయం తీసుకుంటున్నప్పుడు ఆయన కూడా బాధపడ్డారని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. ఇది తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయమే తప్ప, మరొకటి కాదని ఆయన స్పష్టం చేశారు. కేబినెట్ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అన్నమయ్య జిల్లా నూతన కేంద్రంగా మదనపల్లెను ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఇప్పటివరకు జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటి పట్టణం ఆ హెూదాను కోల్పోయింది. తన నియోజకవర్గం జిల్లా కేంద్రం కాకుండా పోవడంతో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర నిరాశకు గురయ్యారు. ఈ విషయం తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఆయన్ను ఓదార్చి, భవిష్యత్తుపై భరోసా ఇచ్చారు.రాయచోటి విషయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి బాధలో అర్థముందని అనగాని సత్యప్రసాద్ అన్నారు. అయితే, జిల్లా కేంద్రంగా రాయచోటితో కలిసి ఉండటానికి ఎవరూ ఇష్టపడటం లేదని ఆయన వివరించారు. రాజంపేట ప్రజలు తమను కడప జిల్లాలో కలపాలని, రైల్వే కోడూరు వాసులు తిరుపతి జిల్లాలో కలపాలని కోరుతున్నారని తెలిపారు. ఈ డిమాండ్ల నేపథ్యంలో జిల్లా ఐక్యతను కాపాడేందుకే,



అందరికీ ఆమోదయోగ్యమైన ప్రాంతంగా మదనపల్లెను ఎంపిక చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఈ సర్దుబాటు చేయకపోతే జిల్లా ఉనికికే ప్రమాదం ఏర్పడేదని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ గందరగోళానికి గత ప్రభుత్వ అసంబద్ధ, అశాస్త్రీయ జిల్లాల విభజనే కారణమని అనగాని విమర్శించారు. ఆనాడు పారదర్శకంగా, ప్రజాభిప్రాయం మేరకు విభజన చేపట్టి ఉంటే నేడు ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదన్నారు. దాని ఫలితమే ఇప్పుడు మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఇబ్బందికర వాతావరణం ఏర్పడిందని అన్నారు. ఏదేమైనా, రానున్న రోజుల్లో రాంప్రసాద్ రెడ్డి ఈ బాధ నుంచి బయటపడతారని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో రాయచోటి ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తారని అనగాని భరోసా ఇచ్చారు.

# రెవెన్యూ క్లినిక్‌కు 72 వినతులు

## సమస్యలకు వేగంగా పరిష్కారం చూపించడమే లక్ష్యం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



క్రైం కౌంటర్ న్యూస్ : విశాఖపట్నం, డిసెంబరు 29 : సుదీర్ఘకాలంగా నలుగుతున్న రెవెన్యూ సమస్యలకు వేగంగా పరిష్కారాన్ని చూపించడమే రెవెన్యూ క్లినిక్‌ల ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌తోపాటు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారాన్ని అందించేందుకు రెవెన్యూ క్లినిక్‌లు దోహదపడతాయన్నారు. ఉన్నత స్థాయి రెవెన్యూ అధికారులంతా ఒకేచోట ఉండి సమాధానం చెప్పడం వల్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్దేశాలను, లక్ష్యాలను అర్థం చేసుకుని పనిచేయాలని అధికారులకు సూచించామన్నారు. కాగా, రెవెన్యూ క్లినిక్ కోసం కలెక్టరేట్ కింది భాగంలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయడంతోపాటు దరఖాస్తులు నింపేందుకు సహాయకులను నియమించారు. అధికారుల ఎదుట ప్రజలు కూర్చుని సమస్య చెప్పుకోవడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. సమస్యలకు సంబంధించిన వివిధ కేటగిరీల వారీగా టేబుళ్లను ఏర్పాటుచేశారు.

రెవెన్యూ క్లినిక్‌కు 72 వినతులు

తొలిసారి నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌కు 72 వినతులు వచ్చాయి. ప్రభుత్వ భూములు, జిరాయితీ భూముల ఆక్రమణ, అసైన్‌మెంట్, జీవో 296 ప్రకారం క్రమబద్ధీకరణ, 22ఏ జాబితా నుంచి భూములు తొలగింపు, తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అందులో ఉన్నాయి.

ఎలమంచిలి రైల్వే స్టేషన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత టాటానగర్–ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ (18189)లో అగ్ని ప్రమాదం సంభవించిన నేపథ్యంలో సోమవారం ఉదయం పలు రైళ్ల రాకపోకలకు ఆటంకం కలిగింది. పూరి–తిరుపతి (17479) సుమారు మూడు గంటలసేపు దువ్వాడ స్టేషన్‌లో నిలిచిపోయింది. ఈ రైలు సోమవారం ఉదయం సుమారు 4.00 గంటలకు దువ్వాడ చేరి, 7.00 గంటల సమయంలో తిరిగి బయలుదేరింది. ఇక హౌరా–తిరుచునాపల్లి ఎక్స్‌ప్రెస్ (12663) ఉదయం 7.20 గంటలకు విశాఖ స్టేషన్‌కు చేరి, తిరిగి 9.00 గంటలకు బయలుదేరింది. సుమారు గంటన్నర సేపు విశాఖ రైల్వే స్టేషన్‌లో నిలిచిపోయింది. అలాగే మల్దా టౌన్–బెంగళూరు అమృతభారత్ (13434) ఉదయం 5.50 గంటలకు విశాఖ స్టేషన్‌కు చేరి తిరిగి 7.50 గంటలకు బయలుదేరింది. సుమారు రెండు గంటలు ఇక్కడ నిలిచిపోయింది. హటియా–బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12835) ఉదయం 8.55 గంటలకు విశాఖ చేరి, తిరిగి 9.35 గంటలకు బయలుదేరింది. ప్రమాద ఘటనపై రైల్వే అధికారులు స్పందించి పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడంతో మిగిలిన రైళ్లు యథావిధిగా రాకపోకలు సాగించాయి.

పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని మంగళవారం నుంచి జనవరి 18వ తేదీ వరకూ విశాఖ–అరకులోయ మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్టు వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్‌కుమార్ తెలిపారు. 08525 నంబరు గల రైలు ఈ నెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతిరోజు ఉదయం 8.40 గంటలకు విశాఖలో బయలుదేరి మధ్యాహ్నం 12.30 గంటలకు అరకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08526 నంబరు గల రైలు ఈ నెల 30 నుంచి జనవరి 18 వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటలకు అరకులో బయలుదేరి సాయంత్రం 6 గంటలకు విశాఖ చేరుతుంది.

# ప్రభుత్వ ఆసుపత్రులని చంద్రబాబు నిర్వీర్యం చెయ్యాలని చూస్తున్నారు



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29, మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, ఈ విషయం మీ సలహాదారుడు కూడా చెప్పలేదా అని వైయస్ఆర్‌సీపీ ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రులు బలపడాల్సిన సమయంలో వాటిని నిర్వీర్యం చేయడం ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడటమేనన్నారు. వైయస్ఆర్ కడప జిల్లాలో జరుగుతున్న పరిణామాలు, ప్రజా సమస్యలపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి స్పందించారు. కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. రేషన్ డీలర్లు పేదలకు సరిగా బియ్యం పంపిణీ చేయడం లేదని ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్లు ఎంపీ తెలిపారు. పేదలందరికీ రేషన్ బియ్యం అందాలన్నదే వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన అని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే 8 వేల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందజేయాలని డిమాండ్ చేశారు. హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించి కోర్టు స్టే వెకెట్ చేయాలని ఏడాది కాలంగా కోరుతున్నా ఎలాంటి పురోగతి లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

# రైతులని ఆదుకోనడంలో కూటమి విఫలం



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29, రాష్ట్రంలో రైతులు తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని, ఇప్పటికే అనేక పంటల రైతులు నష్టాల బాటలో ఉన్న సమయంలో ఇప్పుడు కంది రైతులు కూడా సంక్షోభంలోకి జారిపోయారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (వ్యవసాయం %–% రైతు సంక్షేమం), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ మాజీ వైస్ చైర్మన్ యం.వై.వి.ఎస్. నాగిరెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అయన మాట్లాడుతూ... 2025%–%26 సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7.96 లక్షల ఎకరాలలో కంది సాగు జరిగింది. కంది పంట పూర్తిగా వర్షాధారంగా, మెట్ట ప్రాంతాల్లో సాగు చేసే పంటగా, సంవత్సరానికి ఒక్కసారే సాగు జరుగుతుంది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.8,000 కాగా, ప్రస్తుతం రైతులు తమ పంటను రూ.6,500 నుంచి రూ.6,600 మధ్యనే అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రక్క రాష్ట్రం కర్ణాటకలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కందిని కనీస మద్దతు ధర రూ.8,000కే కొనుగోలు చేస్తోందని వార్తలు వస్తున్నాయి, అదే సమయంలో మన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతులను ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లోకి నెట్టేస్తోంది. పంట మార్కెట్‌కు వచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలు తెరిస్తే రైతు నష్టాల నుంచి బయటపడేవారు, అలాంటి కనీస ఆలోచన కూడా ప్రభుత్వానికి లేదు. కంది సాగు ప్రధానంగా అనంతపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, పల్నాడు, శ్రీ సత్య సాయి జిల్లాల్లో జరిగింది. గత సంవత్సరం కంది ఉత్పత్తి 171 లక్షల టన్నులు కాగా, ఈ సంవత్సరం అంచనా ఉత్పత్తి 117 లక్షల టన్నులకు పడిపోయింది. గత ఏడాది హెక్టారుకు సరాసరి దిగుబడి 473 కిలోలు ఉండగా, ఈ ఏడాది అది 401 కిలోలకు తగ్గే అవకాశం ఉంది. ఉత్పత్తి, దిగుబడి రెండూ తగ్గుతున్న పరిస్థితి రైతులను తీవ్ర నష్టాల్లోకి నెట్టుతోంది.మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారిందని తెలిపారు. మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2,400 కాగా, రాష్ట్రంలో సుమారు 4.6 లక్షల ఎకరాలలో సాగు జరిగినప్పటికీ, దిగుబడులు తగ్గడంతో రైతులు క్వింటాలుకు రూ.1,500 నుంచి రూ.1,900 మధ్యే అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రక్క రాష్ట్రం తెలంగాణలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్నా, మన రాష్ట్రంలో అలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరం. గత సంవత్సరం మొక్కజొన్నకు హెక్టారుకు సరాసరి దిగుబడి 4,710 కిలోలు ఉండగా, ఈ ఏడాది అంచనా 4,254 కిలోలకు పడిపోయిందని, వాస్తవంగా క్షేత్రస్థాయిలో ఇది ఇంకా తగ్గే పరిస్థితి ఉంది. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా అనేక పంటల రైతుల పరిస్థితి ఇదే. అనావృష్టి, అధిక వర్షాలు, తుఫాన్ల ప్రభావంతో సాగు తగ్గడం, దిగుబడులు పడిపోవడం, మార్కెట్ ధరలు కుప్పకూలడం, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు.ఉచిత పంటల బీమా పథకం రద్దు చేయడం, కనీస పెట్టుబడి సాయం కూడా అందించకపోవడం, సున్నా వడ్డీ రాయితీ జమ చేయకపోవడం, అలాగే అన్నదాత సుఖీభవ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయం. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కన్నీరు పెడుతున్న రైతుల పట్ల ప్రభుత్వం ఎందుకు అశ్రద్ధ చూపుతోంది?. “అన్నదాత కంట కన్నీరు మంచిది కాదు” అని ఎంవీఎస్ నాగిరెడ్డి హెచ్చరిస్తూ, ప్రభుత్వం వెంటనే స్పందించి కనీస మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు తెరవాలని, నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని డిమాండ్ చేశారు.

# తాగుబోతులకు గుడ్ న్యూస్: కొత్త లిక్కర్ బ్రాండ్లు, తగ్గిన ధరలు




క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29, ఏపీలో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమల్లోకి తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీ ఫలితాలు ఇవ్వడం ప్రారంభించాయి. నకిలీ మద్యానికి చెక్ పెట్టే లక్ష్యంతో ప్రతి మద్యం సీసాకు ప్రత్యేక నెంబర్ కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.అదే సమయంలో, గతంలో నిలిపివేసిన పాపులర్ బ్రాండ్లను తిరిగి మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. కొన్ని ప్రముఖ బ్రాండ్లపై ధరల తగ్గింపు కూడా అమలు చేయడంతో మద్యం అమ్మకాలు పెరిగినట్లు తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఏపీలో పాపులర్ బ్రాండ్ల విక్రయాలు భారీగా పెరిగాయి. కొన్ని కంపెనీలు ధరలు తగ్గించడంతో వినియోగదారుల ఆసక్తి పెరిగింది. ఫలితంగా మద్యం అమ్మకాల శాతం గణనీయంగా పెరిగింది. గత ప్రభుత్వ మద్యం విధానం కారణంగా రాష్ట్ర ఆదాయంపై ప్రతికూల ప్రభావం పడగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది.నూతన మద్యం పాలసీ అమల్లో భాగంగా పాపులర్ బ్రాండ్లను తిరిగి అందుబాటులోకి తెచ్చింది. అలాగే రూ.99కే క్వార్టర్ మద్యం ప్రవేశపెట్టడంతో తక్కువ ధరల మద్యానికి డిమాండ్ పెరిగింది. ఈ మార్పుల ఫలితంగా మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి.తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతాలు ఉన్న జిల్లాల్లో మద్యం విక్రయాలు 40 శాతానికి పైగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీంతో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం 87 పాపులర్ బ్రాండ్లు తిరిగి మార్కెట్‌లోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో ఈ బ్రాండ్ల అమ్మకాలు 20.7 శాతంగా ఉండగా, ప్రస్తుతం అవి 74 శాతానికి చేరాయి. అలాగే 50 బ్రాండ్ల ధరలను ప్రభుత్వం తగ్గించింది.ఇదిలా ఉండగా, ఏపీ ప్రభుత్వం మద్యం అమ్మకాల్లో నకిలీ నివారణ కోసం వినూత్న విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఇప్పటికే నకిలీ మద్యం నియంత్రణ కోసం మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రతి మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వినియోగదారులు మద్యం నాణ్యతను తెలుసుకునే అవకాశం ఉంది.ఇప్పుడు దేశంలోనే తొలిసారి ప్రతి మద్యం సీసాపై ప్రత్యేక లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్ ముద్రించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మద్యం బ్రాండ్, తయారీ తేదీతో పాటు సీసాకు కేటాయించిన నెంబర్‌ను స్పష్టంగా ముద్రిస్తారు. ఈ నెంబర్ ఆధారంగా మద్యం కొనుగోలు చేసేలా వినియోగదారుల్లో అవగాహన పెంచాలని ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది.ఈ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్సైజ్ శాఖతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మద్యం విధానాన్ని కేవలం వ్యాపారంగా కాకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా అమలు చేయాలని అధికారులకు సూచించారు. జియో ట్యాగింగ్ ద్వారా మద్యం సరఫరాలో పారదర్శకత తీసుకురావాలని, షాపుల ట్రాకింగ్, రేషనలైజేషన్‌పై దృష్టి పెట్టాలని సీఎం పేర్కొన్నారు. అలాగే బాటిల్ తిరిగి ఇస్తే డిపాజిట్ రిటర్న్ స్కీమ్ కింద నగదు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు.. సామర్లకోటకు ప్రయాణికులు..

క్రైం కౌంటర్ న్యూస్, సామర్లకోట, డిసెంబరు 29 విశాఖ జిల్లా దువ్వాడ మీదుగా ఎర్నాకుళం వెళ్లే 18189 నంబరు గల పాట్నా ఎక్స్‌ప్రెస్‌లోని బీ1, ఎం2 ఏసీ బోగీలకు ఎలమంచిలి స్టేషన్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ఏర్పడిన అగ్నిప్రమాదంలో ప్రయాణి కులు తప్పించుకున్నారు. మంటల్లో ఇరుక్కున్న 158 మంది ప్రాణాలు అరచేత పెట్టుకుని కిందికి దిగడంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. అయితే వారిని రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎలమంచిలి నుంచి 3 ప్రత్యేక ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసి కాకినాడ జిల్లా సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చారు. మరోపక్క అగ్ని ప్రమా దంలో మంటల్లో చిక్కుకున్న 3 బోగీలను కట్ చేసి వాటిని ఎలమంచిలి స్టేషన్‌లోనే సైడ్‌లైనుకు చేర్చి మిగిలిన బోగీలతో రైలును సామర్లకోటకు సోమవారం ఉదయం 9 గంటలకు తీసుకొచ్చారు. అప్పటికే సామర్లకోట రైల్వే స్టేషన్‌కు బస్సుల్లో తరలించిన ప్రయాణికులందరికీ స్టేషన్ ఆవర ణలో ప్రత్యేక సపర్యలు చేయడమేగాక అల్పాహా రం, వాటర్ బాటిళ్లను రైల్వే ఎస్ఎం.రమేష్ ఆధ్వ ర్యంలో రైల్వే అధికారులు అందజేశారు. రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్ నుంచి 3 ఏసీ బోగీల ను హుటాహుటిన సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చి ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌కు అనుసం ధానం చేశారు. సుమారు 25 మంది టిక్కెట్ కలె క్టర్ల సాయంతో ప్రయాణికులను సామర్లకోటలో ఏర్పాటు చేసిన 3 బోగీల్లో ఎక్కించారు. సామర్ల కోట నుంచి రైలు 10.45 గం.కు బయలుదేరింది.

ఆందోళనలో ప్రయాణికులు

అగ్నిప్రమాదంలో మంటల్లో చిక్కుకున్నది మొదలు సామర్లకోట స్టేషన్‌లో రైలు తిరిగి బయలు దేరేవరకూ సుమారు 8 గంటల పాటు ప్రయాణికులు తీవ్ర ఆందో ళనకు గురయ్యారు. 158 మంది ప్రయాణికులకు సామర్లకోట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమల కంటి శ్రీనివాసరావు సౌజన్యంతో 3 రకాల అల్పాహారం, 250 వాటర్‌బాటిళ్లను అందజేశారు. శ్రీనివాస రావుకు



ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు. రైళ్ల రాకపోకలకు అంతరాయంరైలు ప్రమాదం కారణంగా అటు విశాఖ, ఇటు విజయవాడ నుంచి సామర్లకోటకు చేరాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంట నుంచి సుమారు 3 గం టల పాటు ఆలస్యంగా చేరుకున్నాయి. పూరీ నుంచి తిరుపతి వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్, హౌరా నుంచి హైద్రాబాద్ వెళ్లాల్సిన ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ నుంచి లింగంపల్లి వెళ్లాల్సిన ఎక్స్‌ప్రెస్‌లు సుమారు రెండు న్నరగంటల పాటు ఆలస్యంగా ప్రయాణించాయి. ప్రయాణికుల అవసరాలను తీర్చేందుకు రైళ్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజెప్పేందుకు సామర్లకోట స్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ సదుపాయాన్ని ఏర్పాటుచేశారు.రంగంలోకి ఉన్నతాధికారులు..అగ్ని ప్రమాద సంఘటనపై విచారణ జరిపేందుకు రైల్వే ఉన్నతాధికారుల దర్యాప్తు రంగంలోకి దిగింది. సికింద్రాబాద్, విజయవాడ నుంచి పలువురు ఉన్నతాధికారులు ఎలమంచిలికి చేరుకున్నారు. మంటలు ఎలా సంభవించాయి అనే కోణంలో సమాచారం రాబట్టారు. పూర్తిగా కాలిపోయిన బోగీల సాంకేతిక సామర్థ్యాన్ని పరిశీలించి రాజ మహేంద్రవరం రైల్వే యార్డుకు చేర్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## భూ సమస్యలకు ఇక చెక్! కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ క్లినిక్‌ల ఏర్పాటు

**సోమవారం నుంచి ప్రారంభమైన సేవలు**
**- 22-ఎ, రీసర్వే, విస్తీర్ణం నమోదులో తేడా, ఆర్వోఆర్ తదితర సమస్యలపై దృష్టి**
**-నిర్దేశిత గడువులోపు పరిష్కారానికి స్పష్టమైన హామీ**
**-రెవెన్యూ క్లినిక్ డెస్క్‌లకు ఇన్‌చార్జిగా డిప్యూటీ కలెక్టర్ పోతురాజు**



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** నియామకంభూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రెవెన్యూ క్లినిక్‌ల పేరుతో కలెక్టరేట్‌లో ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేసింది. జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లోనూ రెవెన్యూ క్లినిక్‌లను సోమవారం ప్రారంభించింది. భూములకు సంబంధించి వివిధ రకాల సమస్యలను పరిశీలించి, సమస్య ఎక్కడుందో తెలుసుకుని, సత్వరమే పరిష్కరించేందుకు ఈ క్లినిక్‌లు పనిచేస్తాయి. కలెక్టరేట్‌లోని రెవెన్యూ క్లినిక్‌లలో ఐదు డెస్క్‌లను ఏర్పాటు చేశారు. ఇందులో నిపుణులైన రెవెన్యూ అధికారులు, సిబ్బందిని నియమించారు. దీంతో పాటు సీనియర్ సిటిజన్‌ల సమస్యలను పరిష్కరించేందుకు కూడా ఒక డెస్క్‌ను ఏర్పాటు చేశారు.


జిల్లా కేంద్రంలో ఐదు డెస్క్‌లు

కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమానికి అనుబంధంగా రెవెన్యూ విభాగంలో భూమి సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ కలెక్టర్ పోతురాజును రెవెన్యూ క్లినిక్ డెస్క్‌లకు ఇన్‌చారి అధికారిగా నియమించారు. ఆయన పర్యవేక్షణలో ఈ రెవెన్యూ క్లినిక్‌లు పనిచేస్తాయి. రెవెన్యూ-సర్వేశాఖ కృష్ణాజిల్లా పేరుతో దరఖాస్తుల పరిశీలన, సలహాలు, సూచనలు అందించేలా ఇక్కడ ఏర్పాట్లు చేశారు. 22-ఎ భూముల సమస్యలు, భూసేకరణ సమస్యలు, ఆర్వోఆర్, పట్టాదారు పాస్‌పుస్తకాలు, సుమోటో అడంగల్ కరక్షన్ సంబంధిత సమస్యలు, రీ సర్వే, విస్తీర్ణం నమోదులో తేడా, జాయింట్ ఎల్‌పీఎం, ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఐదు డెస్క్‌లను సిద్ధం చేశారు. ఇక్కడ దరఖాస్తులను అందుకున్న అధికారులు సమస్యలు ఏమిటనే అంశంపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. వచ్చిన అర్జీలను రిజిస్టర్‌లో, ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏ మండలంలో సమస్యలు ఉన్నాయో పరిశీలించి సంబంధిత తహసీల్దార్‌లకు ఫోన్ చేసి ఈ సమస్యలు ఎందుకు ఏర్పడ్డాయో తెలుసుకుని పరిష్కార మార్గాన్ని కూడా ప్రత్యేక డెస్క్‌లలో ఉన్న రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. భూమి రికార్డులకు సంబంధించిన అన్ని పత్రాలను పరిశీలించి, సరైన పత్రాలు లేకుంటే తీసుకురావాలని కూడా సూచిస్తున్నారు. అన్ని పత్రాలు పరిశీలించిన అనంతరం ఎన్ని రోజుల్లోగా ఈ సమస్యలను పరిష్కరించాలో తహసీల్దార్‌లకు సూచిస్తున్నారు. సోమవారం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు, సరిహద్దులు నిర్ణయించడంలో జరిగిన తప్పులు, రీ సర్వేలో భూమి విస్తీర్ణం తగ్గడం, భూమి ఆక్రమణలు తదితర అంశాలపై 77 ఫిర్యాదులు అందాయి.

అర్జీలు ఇచ్చినా పరిష్కారం కాకపోవడంతో..

ఇప్పటి వరకు తహసీల్దార్ కార్యాలయాల్లో భూమి సమస్యలను పరిష్కరించాలని నెలల తరబడి బాధిత రైతులు తిరిగినా పరిష్కారానికి నోచుకోవడంలేదు. దీంతో ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమానికి వచ్చి రైతులు తమ సమస్యలను విన్నవిస్తున్నారు. ఒకటీ రెండు విషయాల్లో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ లేదా జేసీ ఆయా మండలాల తహసీల్దార్‌లతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని చెబుతున్నారు. మిగిలిన అర్జీలను ఆన్‌లైన్‌లో సంబంధిత తహసీల్దార్‌లకు పంపి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని చెప్పినా, అవి పెండింగ్‌లోనే ఉండిపోతున్నాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించిన సమస్యలపై కలెక్టర్ లేదా జేసీ అర్జీలను స్వీకరించి సంబంధిత మండలాల తహసీల్దార్‌లు లేదా ఆర్డీవోలకు పంపినా ఈ సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో బాధిత రైతులు పదేపదే కలెక్టరేట్‌కు వచ్చి అర్జీలు అందజేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భూమి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు అన్ని తహసీల్దార్ కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లోనూ రెవెన్యూ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఎంతమేర భూమి సమస్యలు పరిష్కారం అవుతాయో వేచిచూడాలి. రెవెన్యూ క్లినిక్‌లో అర్జీలు ఇచ్చినా కలెక్టర్ వద్దకు వెళ్లి ఈ సమస్యలను చెప్పుకునే వెసులుబాటు కూడా ఉ ఒదని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

## ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీల వేతనాలని ప్రభుత్వం పెండింగ్ లో పెడుతుంది



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ చర్యలపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు వైయస్‌ఆర్‌సీపీ పంచాయత్ రాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రా రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా బెలుం గుహలను సందర్శించడానికి వచ్చిన పంచాయత్ రాజ్ డిపార్ట్మెంట్ అల్ ఇండియా ఐఏఎస్ జాయింట్ సెక్రటరీ రాజేష్ కుమార్ సింగ్‌కు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వెన్నపూస రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ%ొ% రాజ్యాంగ పరంగా పంచాయతీ రాజ్ సంస్థలకు కేటాయించిన 15వ ఫైనాన్స్ నిధులపై కూటమి ప్రభుత్వం అక్రమంగా పెత్తనం చెలాయిస్తూ దొంగ సర్క్యులర్లు జారీ చేస్తోందని మండిపడ్డారు. ముఖ్యంగా మెమో నంబర్ 3082065 (తేది: 24-12-2025) ద్వారా నిధులను వినియోగించకుండా అడ్డుకోవడం పూర్తిగా అన్యాయమన్నారు. ఈ మెమోను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.పంచాయతీ స్థాయి ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పొందవలసిన గౌరవ వేతనాలను కూడా ఉ ద్దేశపూర్వకంగా పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. అంతేకాకుండా ప్రభుత్వ ప్రోటోకాల్‌ను పాటించకుండా స్థానిక ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని, ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు కూడా పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అన్ని చర్యలకు కారణం ఒక్కటే%ొ% స్థానిక ప్రజాప్రతినిధులు వైయస్‌ఆర్‌సీపీకి చెందిన వారే కావడమని వెన్నపూస రవీంద్రా రెడ్డి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపుతో గ్రామ స్వరాజ్యాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.ఇలాంటి దొంగ సర్క్యులర్లే కూటమి ప్రభుత్వ పతనానికి నాంది అవుతాయని హెచ్చరిస్తూ, ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని స్పష్టం చేశారు.

## ఏపీలో 28కి పెరిగిన జిల్లాల సంఖ్య.. ప్రతిపాదనలకు మంత్రివర్గ ఆమోదం

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 28కి పెరగనుంది. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం జిల్లాలుకొత్తగా ఏర్పాటు కానున్నాయి. సీఎం నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం ఏపీ కేబినెట్ భేటీ జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అలాగే జిల్లాల పునర్విభజన ప్రతిపాదనల చర్చించారు. అనంతరం ఈ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో రాష్ట్రంలోకొత్తగా మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం జిల్లాలు ఏర్పాటు కానున్నాయి.

మరోవైపు ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో ఉన్న రాయచోటిని మదనపల్లె జిల్లాలో కలపనున్నారు. అలాగే రాజంపేటను వైఎస్ఆర్ కడప జిల్లాలో చేర్చనున్నారు. రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో చేర్చనున్నారు. వీటితో పాటుగా తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరును నెల్లూరులో కలపాలనే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గ ఆమోదం నేపథ్యంలో ఫైనల్ నోటిఫికేషన్ డిసెంబర్ 31న విడుదల కానుంది.

మంత్రివర్గ భేటీలో ఏడ్చేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

మరోవైపు మంత్రివర్గ సమావేశం సందర్భంగా రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని.. తాజాగా మదనపల్లె జిల్లాలో కలపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రతిపాదనల నేపథ్యంలో మంత్రి మండిపల్లి కన్నీరు పెట్టుకోగా.. చంద్రబాబు ఓదార్చారు. రాయచోటి అభివృద్ధి మీద మంత్రికి హామీ ఇచ్చారు. జిల్లా కేంద్రం



మార్చకపోతే వచ్చే.. సాంకేతికపరమైన ఇబ్బందులను వివరించారు.

రాయచోటిలో ఆందోళనలు.. మరోవైపు అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాయచోటిని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఉద్యోగ సంఘాలు, విద్యార్థులు, రాజకీయ పార్టీల నేతలు ఇందులో పాల్గొంటున్నారు. సోమవారం రోజున భారీ ర్యాలీ చేపట్టడంతో పాటుగా మానవహారం ఏర్పాటు చేశారు. మదనపల్లె వద్దు రాయచోటి ముద్దు అని నినాదాలు చేశారు. వెనుకబడిన ప్రాంతమైన రాయచోటి అభివృద్ధి చెందాలంటే.. జిల్లా కేంద్రంగానే కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఫ్లెక్సీలను సైతం తొలిగిస్తున్నారు అంటే ఎలాంటి పాలన నడుస్తుందో తెలుసుకోవాలి



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** వినుకొండ నియోజకవర్గంలో కూటమి నేతల రాక్షస పాలన కొనసాగుతోందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యులు, వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు తీవ్ర స్థాయిలో విమర్శించారు. వినుకొండ పట్టణంలోని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..... డిసెంబర్ 21న మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి జన్మదినం, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా వైయస్‌ఆర్‌సీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూటమి నేతలు తొలగించడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైయస్‌ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకునే హక్కు లేదా? వినుకొండ కూటమి నేతల జాగిరా కాదని ప్రశ్నించారు. ఫ్లెక్సీలను మళ్లీ ఏర్పాటు చేస్తామని, ఈసారి ఎలా తొలగిస్తారో చూస్తామని హెచ్చరించారు.రైతులకు యూరియా సరఫరా చేయలేని కూటమి ప్రభుత్వం.. రాష్ట్రాన్ని దేశంలో నంబర్%-%1గా మారుస్తామని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు కు చెందిన బయో ఉత్పత్తులు వాడటం వల్ల రైతులు పంట నష్టాలు చవిచూస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని చెరువులను జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు తన బంధువుల ద్వారా స్వాధీనం చేసుకుని, ఆ భూములను బ్యాంకుల్లో పెట్టి కోట్ల రూపాయల రుణాలు పొందుతూ, చెరువుల ఆదాయాన్ని స్వంతంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. తమ పాలనలో నియోజకవర్గంలో సుమారు 100 మంది విలేకరులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని, కూటమి నేతలు విలేకరుల కోసం ఏం చేశారో చెప్పాలని సవాల్ విసిరారు.మంచినీటి చెరువుకు రూ.159 కోట్ల నిధులు మంజూరయ్యాయని సంవత్సరాలుగా చెబుతున్నారని, ఆ నిధులు ఎక్కడ ఉన్నాయో, చెరువు నిర్మాణం ఎక్కడ జరిగిందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## ఎన్నో జ్ఞాపకాలు.. పారిశ్రామిక అభివృద్ధిపై చంద్రబాబు ఫోకస్

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 29,** 2025.. కందనవోలు ముంగిట మధుర జ్ఞాపకాలు.. సంతోషాలు.. విషాదాలు.. కష్టాలు.. కన్నీళ్లు మిగిల్చి రేపటి అర్ధరాత్రి 12 గంటలకు కాలగర్భంలో ఒదిగిపోనుంది. ఈ ఏడాదిలో పలు జ్ఞాపకాలు మిగిలిపోగా గత చరిత్రను గుర్తుకు తెచ్చాయి. కళావిందు కనువిందు చేశాయి. మరో వైపు పలు సంఘటనలు విషాదాన్ని నింపాయి. మనుషుల మనసును పిండేశాయి. కష్టజీవులకు కన్నీళ్లు పెట్టించాయి. కాలగమనంలో ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చి 2025 కనుమరుగు కానుంది. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు కొంగొత్త ఆశలు.. ఆశయాలతో 2026 సంవత్సరం ఉదయించబోతుంది. ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు కందనవోలు గడ్డపై చోటు చేసుకున్న ముఖ్యమైన సంఘటనలు.. సంబరాలు.. సంతోషాలను అవలోకనం చేసుకుందాం.పారిశ్రామిక ప్రగతి అడుగులు

జిల్లాలో ఆరు కొత్త పరిశ్రమలు, మూడు ఎంఎసఎంఈ పార్కులకు సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఇందులో కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం వద్ద ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌టీఓ), ఓర్వకల్లు పారిశ్రామిక నోడ్‌లో 300 ఎకరాల్లో నిర్మించే దేశంలోనే తొలి డ్రోన్ సిటీ, రూ.1,622 కోట్లతో బ్రాహ్మణపల్లి వద్ద నిర్మించే రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, రూ.285 కోట్ల పెట్టుబడితో చేపట్టిన సిగాచీ ఇండస్ట్రీస్.. వంటి కీలక ప్రాజెక్టులు ఉన్నాయి.

యోగా కర్నూలు.. యోగాంధ్ర-2025

అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 కార్యక్రమం పేరిట నెల రోజులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అదే స్ఫూర్తితో కర్నూలులో నెల రోజులు పాటు నిత్యజీవితంలో యోగా ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. జూన్ 21న అవుట్ డోర్ స్టేడియం, రాయలసీమ యూనివర్సిటీ, బుద్ధ పిరమిడ్ ధ్యాన కేంద్రం తదితర సంస్థల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యోగా ఆసనాలతో రికార్డులోకెక్కారు.దేవరగట్టు.. కర్రపట్టు

దక్షణాది రాష్ట్రాల్లో ప్రత్యేకమైన దేవరగట్టు కర్రల సమరం (బన్నీ ఉత్సవం) జరిగింది. మాళమల్లేశ్వరస్వామి విజయోత్సవాన్ని పురస్కరించుకుని విజయ దశమి రోజున నిర్వహించిన సంప్రదాయ బన్నీ ఉత్సవంలో ఆధ్యాత్మిక విల్లివిరిసింది. లక్షలాది భక్తజనం పాల్గొన్నారు. కర్రల సమరంలో జరిగిన తొక్కిసలాట, హింస కారణంగా ఇద్దరు మరణిస్తే, వంద మందికిపైగా గాయపడ్డారు.

కళావిందు.. కర్నూలు ఉత్సవ్

ఆంధ్ర రాష్ట్ర అవతరణను పురస్కరించుకుని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో 'కర్నూలు ఉత్సవ్' కళా సంబరాలు నవంబరు 1-7 వరకు వారం రోజులు పాటు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఆంధ్ర రాష్ట్ర తొలి రాజధాని కర్నూలు వైభవం, చారిత్రాత్మక వైభవం, ఆధ్యాత్మికత, సంస్కృతి, సాహిత్యం, వ్యాసరచన పోటీలతో విద్యార్థులు, యువతరానికి అవగాహన కల్పించారు. కళా ప్రదర్శనలతో కనువిందు చేశారు. ఏడు రోజుల పాటు నిర్వహించిన నాటక పోటీల్లో 70కి పైగా బృందాలు తమ ప్రదర్శనలు ఇవ్వడంతో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో టీజీవీ కళాక్షేత్రం చోటు దక్కించుకుంది.

జాతరలు.. సందళ్లు

రైతుల జాతరగా పిలిచే ఎమ్మిగనూరు నీలకంఠేశ్వరస్వామి జాతర మహోత్సవం, మహా రథోత్సవం దేదిప్యమానంగా జరిగింది. నెల రోజులు పాటు జరిగే ఈ జాతరలో వ్యవసాయ పరికరాలు, కాడెద్దులు, వంటసామగ్రి విక్రయాలకు ప్రసిద్ధి. ఏప్రిల్ 24న కోడుమూరు నియోజకవర్గం గూడూరు తిమ్మగురుడుస్వామి జాతర రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. మార్చి 1-6 వరకు, ఆగస్టు 8 - 14 వరకు దక్షణాది ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవాలు, ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురు వైభవోత్సవాలకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. మే 19న ఆదోని అవదూత మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర మహోత్సవం కనువిందు చేసింది. వెండి రథంపై అవ్వను ఊరేగించారు.


కన్నీటి వీడ్కోలు ఆలూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే జి.లోక్‌నాథ్ గుండెపోటుతో మృతి చెందారు. 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. టీటీడీ సభ్యుడిగా పని చేశారు. ఐదేళ్లు ఎమ్మెల్యే, టీటీడీ సభ్యుడిగా పని చేసినా.. సాధారణ జీవనం గడిపారు. మాజీ ఎమ్మెల్యేలకు ఇచ్చే పింఛన్ ద్వారానే జీవనయానం సాగించారు. రాయలసీమ సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు అనారోగ్యంతో కన్నుమూశారు.

## సినిమా



# రామ్ చరణ్ 'పెద్ది'లో మరో స్టార్ యాక్టర్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకు తగ్గట్టుగానే భారీ స్టార్ క్యాస్టింగ్ తో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఉప్పెన సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, మీర్జాపూర్ వెబ్ సిరీస్ ఫేమ్ దివ్యేందు త్రిపాఠి, కమెడియన్ సత్య తదితరులు ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ ఈ మెగా మూవీకి స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్, గ్లింప్స్ , సాంగ్ కు అభిమానుల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా చికిరీ సాంగ్ యూట్యూబ్ ను షేక్ చేస్తోంది. వందల మిలియన్ల వ్యూస్ తో దూసుకెళ్లిపోతోంది. ఇప్పటికే ఈ పాట అన్ని భాషల్లో కలిపి 100 మిలియన్ల మార్క్ అందుకుంది. ప్రస్తుతం పెద్ది సినిమా షూటింగ్ తెరకెక్కుతోంది. ఇటీవలే ఢిల్లీలో కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీ కరించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో బాగా వైరల్ కూడా అయ్యాయి.కాగా వచ్చే ఏడాది వేసవిలో పెద్ది సినిమాను రిలీజ్ చేయనున్నారు. రామ్ చరణ్ పుట్టిన రోజు కానుకగా మార్చి 27న ఈ మెగా మూవీని ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. దీంతో సినిమా ప్రమోషన్లలో స్పీడ్ పెంచింది చిత్ర బృందం. తాజాగా పెద్ది సినిమా నుంచి ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఇందులో నటిస్తోన్న ఓ టాలీవుడ్ స్టార్ నటుడి ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ పోస్టర్ నెట్టింట వైరల్ గా మారింది. ఎందుకంటే ఈ ఫొటోలో ఉన్న నటుడిని గుర్తుపట్టడం కొంచెం కష్టమే.ఒకప్పుడు టాలీవుడ్ లో హ్యాండ్సమ్ హీరోగా చేశాడు. ఇప్పుడు విలన్ గానూ, సహాయక నటుడిగానూ అదరగొడుతున్నాడు. ప్రస్తుతం చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంటోన్న ఆ నటుడు మరెవరో కాదు జగపతి బాబు. ఇందులో ఆయన అప్పలసూరి అనే పాత్రలో కనిపించనున్నారని పెద్ది చిత్ర బృందం ప్రకటించింది. ఫస్ట్ లుక్ పోస్టర్ తోనే ఇంట్రెస్ట్ క్రియేట్ చేసిన జగ్గూ భాయ్ ఇందులో పాజిటివ్ రోల్ లో నటిస్తున్నాడా? లేదా నెగిటివ్ క్యారెక్టరా అన్నది సినిమా రిలీజ్ అయితే తప్ప క్లారిటీ రాదు.






# 10 రోజులు షుగర్ తినడం మానేస్తే రప్పా రప్పే.


ప్రస్తుత కాలంలో షుగర్ కట్ చాలెంజ్ ట్రెండ్ అవుతోంది. అంటే చక్కెర వినియోగాన్ని తగ్గించడం లేదా పూర్తిగా మానేయడం.. ఇది ఆరోగ్యకరమైన జీవనశైలికి, బరువు తగ్గడానికి, శక్తి పెంచుకోవడానికి, మధుమేహం వంటి సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది.. కానీ దీనిలో చక్కెర కోరికలను నియంత్రించడం, ప్రాసెస్ చేసిన ఆహారాలకు దూరంగా ఉండటం సవాలుగా ఉంటుంది.. అన్ని చక్కెర ఆహారాలను తగ్గించడం లేదా మానేయడం అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.. అందుకే.. ప్రజలు తమ తినే ఆహారంలో ఎంత చక్కెర ఉందో తెలుసుకోవాలని ఆసక్తి పెరిగింది. తినే ఆహారంలో చక్కెరను నివారించిన తర్వాత మన శరీరంలో జరిగే మార్పులు ఏంటి నిపుణులు ఏమంటున్నారు..? అనే వివరాలను తెలుసుకుందాం..

2023 లాన్సెట్ ప్రచురించిన రిపోర్ట్ ప్రకారం.. భారతదేశంలో 10 కోట్ల మంది మధుమేహంతో బాధపడుతున్నారు. ఈ టైప్ టు దయాబెటిస్ ఇన్సులిన్ నిరోధకత, ఉబకాయం, నాన్ ఆల్కహాలిక్ క్ ఫ్యాటీ లివర్ డిసీస్, గుండె జబ్బులు అనేక పరిణామాలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మన శరీరానికి గ్లూకోజ్ అనే చక్కెర కచ్చితంగా అవసరం. మెదడు పనితీరుకు ఈ గ్లూకోస్ ఎంతో అవసరం. మొత్తం శరీరానికి శక్తినిచ్చే ప్రధాన వనరు ఈ గ్లూకోస్. కానీ మన ఆహారంలో గ్లూకోస్ ను బయట నుంచి కలపాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మనం తినే ఆహారం నుంచి కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులను విచ్ఛిన్నం చేయడం ద్వారా మన శరీరం దానికి అవసరమైన గ్లూకోస్ ను తయారు చేసుకోగలదు.

పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు వంటి కార్బోహైడ్రేట్లు ఉన్న అన్ని ఆహారాలలో చక్కెర సహజంగా కనిపిస్తుంది. సహజంగా చక్కెర ఉన్న ఆహారాలను తీసుకోవడం హానికరం కాదు. కానీ మనం తినే ఆహారంలో బయటి నుంచి షుగర్ యాడ్ చేయడం వల్ల అనేక అనారోగ్యాలకు దారితీస్తుంది. ఈ బయటి నుంచి ఆడ్ చేసే షుగర్ తగ్గించడం వల్ల చాలా స్పష్టమైన ప్రయోజనాలు ఉన్నాయని ఎక్స్పర్ట్స్ అంటున్నారు. యాడెడ్ షుగర్ తగ్గించడం వల్ల మొదట్లో కొంత మందికి తలనొప్పి, అలసట మానసికంగా కొన్ని మార్పులు కనిపించడంతోపాటు.. భవిష్యత్తులో మంచి రిజల్ట్ కు దారితీస్తుందని నిపుణులు అంటున్నారు.

యాడేడ్ షుగర్ అది రోజులపాటు పూర్తిగా మానేయడం వల్ల కొలెస్ట్రాల్, రక్తపోటు స్థాయిలో మార్పులు వస్తాయని నిపుణులు అంటున్నారు. మన జీర్ణవ్యవస్థ ఆరోగ్యం ఆరు రోజుల్లో మెరుగుపడుతుంది.. వారం రోజుల్లో మానసిక స్థితిలో మార్పు, పది రోజుల్లో చర్మం ప్రకాశవంతంగా మారడం ప్రారంభమవుతుందని పరిశోధకులు తెలుపుతున్నారు. శరీర బరువులో మార్పులను గమనించడానికి కనీసం ఒక నెలపాటు షుగర్ కు దూరంగా ఉండాలని.. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి అని వైద్యులు అంటున్నారు.

పెద్దలు రోజుకు 30 గ్రాములకు మించి యాడెడ్ షుగర్ తీసుకోవద్దని, రెండు నుంచి మూడు సంవత్సరాల మధ్య పిల్లలు రోజుకు 14 గ్రాములకు మించి యాడెడ్ షుగర్ తినకూడదు. రోజువారి క్యాలరీలలో 10 శాతానికి పైగా ఉండకూడదు. ఐదు శాతంకి ఈ యాడేడ్ షుగర్ తగ్గిస్తే అదనపు ప్రయోజనాలు పొందవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేస్తోంది.



# తినేముందు తప్పక తెలుసుకోండి..

సాయంత్రం కాగానే చల్లని వాతావరణంలో వేడివేడిగా ఏదైనా తినాలనిపించడం సహజం. ముఖ్యంగా చలికాలం, వర్షాకాలంలో సమోసాలు, పకోడీలు, బజ్జీల మీదకు మనసు మళ్లుతుంది. అయితే సాయంత్రం 6 గంటల తర్వాత మీరు తీసుకునే ఆహారమే మీ జీర్ణక్రియను, జీవక్రియను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటో ఒకసారి చూద్దాం..

సాయంత్రం 6 తర్వాత వీటిని దూరం పెట్టండి

రుచి కోసం మనం తినే కొన్ని పదార్థాలు శరీరంలో కొవ్వును, చక్కెర స్థాయిలను అకస్మాత్తుగా పెంచుతాయి. ముఖ్యంగా ఈ ఆహారాలకు దూరంగా ఉండటం మంచిది..

వేయించిన పదార్థాలు: సమోసాలు, వేయించిన మోమోలు, పకోడీలు.జంక్ ఫుడ్: వెన్న ఎక్కువగా ఉండే బర్గర్లు, పిజ్జాలు.

స్వీట్లు: జిలేబీలు మరియు అధిక చక్కెర కలిగిన ఇతర స్వీట్లు.

స్ట్రీట్ ఫుడ్: పానీపురి వంటి మసాలా ఆహారాలు.

ఎందుకు తినకూడదు?

వేయించిన ఆహారాలకు, టైప్-2 దయాబెటిస్‌కు ప్రత్యక్ష సంబంధం ఉంది. ఇవి ఇన్సులిన్ నిరోధకతను పెంచి రక్తంలో చక్కెర స్థాయిలను అస్తవ్యస్తం చేస్తాయి. రాత్రి వేళల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. ఈ సమయంలో భారీ ఆహారం తీసుకోవడం వల్ల గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు తలెత్తుతాయి. నూనెలో వేయించిన పదార్థాలు పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను తగ్గించి, వాపును పెంచుతాయని పరిశోధనలు చెబుతున్నాయి. వీటిలో కేలరీలు అధికంగా ఉండటం వల్ల శరీరంలో కొవ్వు వేగంగా పేరుకుపోతుంది.

సాయంత్రం పూట ఆరోగ్యకరమైన స్నాక్స్ ఏవి?

వేయించిన స్నాక్స్‌కు బదులుగా కడుపుకు తేలికగా ఉండే, పోషక విలువలు కలిగిన ఈ క్రింది ఆహారాలను ఎంచుకోవచ్చు:

నూనె లేకుండా వేయించిన మఖానా ఆరోగ్యానికి మంచిది.

ఉడికించిన స్వీట్ కార్న్. వేడివేడి వెజిటబుల్ సూప్.

# 7 వికెట్లంటే సామాన్యమా సామీ..

ఐపీఎల్ 2026 వేలానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్‌మెంట్ తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం ఇవ్వకపోయినా, మహారాష్ట్ర ఆల్ రౌండర్ రామకృష్ణ ఘోష్ పై నమ్మకంతో అతడిని రిటైన్ చేసుకుంది. ఇప్పుడు ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రామకృష్ణ దేశవాళీ క్రికెట్‌లో నిప్పులు చెరుగుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఏకంగా 7 వికెట్లు పడగొట్టి చరిత్ర సృష్టించాడు.

జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం వేదికగా హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో రామకృష్ణ ఘోష్ తన బౌలింగ్‌తో మ్యాజిక్ చేశాడు. కేవలం 9.4 ఓవర్లు వేసి, 42 పరుగులకే 7 వికెట్లు పడగొట్టాడు. ఈ అద్భుత ప్రదర్శనతో మహారాష్ట్ర తరపున విజయ్ హజారే ట్రోఫీలో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన బౌలర్‌గా రామకృష్ణ రికార్డు సృష్టించాడు. ఇంతకుముందు 2014లో డొమినిక్ ముత్తుస్వామి పేరిట ఉన్న (6 వికెట్లు) రికార్డును ఇతడు చెరిపివేశాడు. అతని స్పెల్ ధాటికి హిమాచల్ ప్రదేశ్ జట్టు 270 పరుగులకే కుప్పకూలింది.

విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో 7 అంతకంటే ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్ల జాబితా చాలా చిన్నది. రామకృష్ణ ఘోష్ ఈ ఘనత సాధించిన కేవలం 12వ బౌలర్‌గా నిలిచాడు. షాబాజ్ నదీమ్, అర్పిత్ గులేరియా (8 వికెట్లు) ఈ జాబితాలో ముందుండగా, ఇప్పుడు రామకృష్ణ పేరు కూడా ఆ దిగ్గజాల సరసన చేరింది. హిమాచల్ ఇన్నింగ్స్ ఆరంభంలోనే టాప్-4 బ్యాటర్లను పెవిలియన్ పంపి ఆ జట్టు వెన్నుముక విరిచాడు.

రామకృష్ణ కేవలం బౌలర్ మాత్రమే కాదు, పక్కా ఆల్ రౌండర్ అని నిరూపించుకుంటున్నాడు. ఇదే టోర్నీలో పంజాబ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో బ్యాట్‌తో మెరుపులు మెరిపించి 73 పరుగులు చేశాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనూ అతనికి రెండు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. టీ20 ఫార్మాట్‌లో ఇప్పటివరకు గణాంకాలు అంత గొప్పగా లేకపోయినా, ప్రస్తుతం ఉన్న ఫామ్ చూస్తుంటే ఐపీఎల్ 2026లో సీఎస్కే తరపున తుది జట్టులో అతనికి చోటు ఖాయమనిపిస్తోంది.

చెన్నై సూపర్ కింగ్స్ ఎప్పుడూ యంగ్ టాలెంటును ప్రోత్సహిస్తుంది. 2025లో 30లక్షలకు కొనుగోలు చేసినప్పటికీ ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వలేదు, కానీ అతడిలోని టాలెంట్‌ను గుర్తించి వదులుకోలేదు. రామకృష్ణ ఘోష్ ఇప్పుడు చేస్తున్న రికార్డులు చూస్తుంటే, వచ్చే ఐపీఎల్ సీజన్‌లో చెన్నైకి మరో శార్దూల్ ఠాకూర్ దొరికాడని ఫ్యాన్స్ సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు.




# కోచ్ పదవి నుంచి గౌతమ్ గంభీర్ అవుట్?

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను పదవి నుంచి తొలగిస్తున్నారంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న వార్తలకు ఎట్టకేలకు బ్రేక్ పడింది. కివీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత్ ఓడిపోవడం, ఆపై వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించలేకపోవడంతో గంభీర్ కోచింగ్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో ఆయనను తప్పించి కొత్త కోచ్‌ను తెస్తున్నారని ప్రచారం జరిగింది. అయితే ఈ రూమర్లపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఘాటుగా స్పందించింది.

రాజీవ్ శుక్లా ఏమన్నారంటే?

బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా ఈ వ్యవహారంపై నోరు విప్పారు. గంభీర్‌ను తొలగిస్తున్నారనేది కేవలం మీడియా సృష్టి అని కొట్టిపారేశారు. "కోచ్ మార్పు గురించి వస్తున్న వార్తలన్నీ అవాస్తవం. మా వద్ద అలాంటి ప్లాన్ ఏదీ లేదు. గంభీర్ పదవికి ఎలాంటి ఢోకా లేదు" అని ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ఆయన స్పష్టం చేశారు. దీంతో గంభీర్ ఫ్యాన్స్ ఊపిరి పీల్చుకున్నారు.

బీసీసీఐ సెక్రటరీ సీరియస్

అంతకుముందు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కూడా ఇదే విషయంపై స్పందించారు. గంభీర్‌ను తీసేస్తున్నారనే వార్తల్లో ఏమాత్రం నిజం లేదని, ఇదంతా ఎవరో కల్పించిన కట్టుకథ అని ఆయన మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు కావాలనే తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నాయని, టీమ్ ఇండియా కొత్త కోచ్ కోసం తాము ఎలాంటి అన్వేషణ చేయడం లేదని ఆయన తేల్చి చెప్పారు.

ముందున్నది అసలైన సవాలు

టెస్టుల్లో పరాజయాలను పక్కన పెట్టి, టీమిండియా ఇప్పుడు వైట్ బాల్ క్రికెట్‌పై దృష్టి సారించనుంది. ముఖ్యంగా 2026లో జరగబోయే టీ20 వరల్డ్ కప్ భారత్‌కు చాలా కీలకం. ఈ మెగా టోర్నీకి భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరిగే ఈ టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచి తన టైటిల్‌ను కాపాడుకోవాలని టీమ్ ఇండియా పట్టుదలతో ఉంది. గంభీర్ పర్యవేక్షణలోనే జట్టు ఈ టోర్నీకి సిద్ధం కానుంది.

మొత్తానికి బీసీసీఐ ఇచ్చిన ఈ క్లారిటీతో కోచ్ మార్పుపై జరుగుతున్న చర్చకు తెరపడింది. ఇప్పుడు అందరి దృష్టి గంభీర్ సారథ్యంలో భారత్ మళ్ళీ విజయాల బాట ఎలా పడుతుంది అనే అంశంపైనే ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com